సాక్షి
హనుమకొండ
సోమవారం, 6, ఫిబ్రవరి, 2023



15 క్వింటాళ్ల బెల్లం పట్టివేత

అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల నల్లబెల్లం, పటిక, నాటుసారా పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. - 8లో



క్రెడిట్‌కార్డు పేరుతో మోసం

క్రెడిట్‌కార్డు ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నాని, కార్డు వివరాలు ఎంటర్ చేసి ఓటీపీ చెప్పమనడంతో ఓ వ్యక్తి అకౌంట్ నుంచి నగదు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. - 8లో

గరిష్టం/కనిష్టం
$33^0/17^0$

వాతావరణం

ఉదయం తేమతో కూడిన చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి పూట చలి తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి 'నాయిని హాథ్ సే హాథ్' యాత్ర

26 డివిజన్లు 28 రోజులు..

హన్మకొండ చౌరస్తా: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి 'హాథ్ సే హాథ్' జోడో యాత్రకు శ్రీకారం చుట్టారు. సోమవారం ఉదయం 8 గంటలకు 29వ డివిజన్ పరిధి రామన్నపేట ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్ నుంచి యాత్ర ప్రారంభమవుతుందని రాజేందర్‌రెడ్డి యాత్ర షెడ్యూల్‌ను ఆదివారం ప్రకటించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 26 డివిజన్లు.. 28 రోజులపాటు సాగే ఈ యాత్రకు సంబంధించి డివిజన్ల ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు పేర్కొన్నారు. ప్రతి ఇంటి తలుపుతట్టి సమస్యలు తెలుసుకోవడమే లక్ష్యమని చెప్పారు.

10 నుంచి ఎంసీఏ సెకండియర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఎంసీఏ సెకండియర్ మొదటి సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) పరీక్షలు ఈనెల 10 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక ఆదివారం తెలిపారు. ఈనెల 10, 13, 15, 17, 20 తేదీల్లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఆయా పరీక్షలు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం



ఎంజీఎం : వరంగల్ ఎంజీఎం జంక్షన్‌లో ఆదివారం సిగ్నల్ స్తంభం విరిగి రోడ్డుపై పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఉన్న ఇనుప స్తంభం తుప్పుపట్టిపోవడంతో విరిగిపోయి ఈ ఘటన చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ సీఐ బాబులాల్, జీడబ్ల్యూఎంసీ అధికారులు వెంటనే స్పందించి ఆ స్తంభాన్ని తొలగించారు.

'వందే భారత్' పైలెట్లకు కొత్త డ్రెస్ కోడ్ పెట్టాలి

- కాజీపేట రైల్వే సంఘ్ నాయకులు

కాజీపేట రూరల్: వందేభారత్ రైళ్లు నడిపిస్తున్న కాజీపేట, సికింద్రాబాద్‌తో పాటు ఇతర చోటు నుంచి పని చేస్తున్న లోకో పైలెట్, అసిస్టెంట్ లోకో పైలెట్, గార్డు (క్రూ లింక్‌లు)లకు కొత్త తరహా డ్రెస్ కోడ్ ఏర్పాటు చేయాలని లేఖ రాసినట్లు ఆదివారం కాజీపేట రైల్వే సంఘ్ నాయకులు తెలిపారు. ఈ మేరకు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ ఢిల్లీ జనరల్ సెక్రటరీ, సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ ఎంప్లాయీస్ సంఘ్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం. రాఘవయ్య ఈనెల 3న రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాసినట్లు పేర్కొన్నారు. వందేభారత్ హైస్పీడ్ ట్రైన్స్ నడిపే లోకో పైలెట్లు, గార్డులకు బ్లూ ప్యాంట్, స్కైబ్లూ పుల్ షర్ట్, నెక్ టై, నేమ్ ప్లేట్, ఏయిర్ క్రాఫ్ట్ పైలెట్ మాదిరిగా హ్యాట్, డ్రెస్‌కోడ్ మంజూరు చేయాలని కోరినట్లు నాయకులు తెలిపారు.

ముగిసిన పోతన విజ్ఞాన పీఠం వార్షికోత్సవాలు



హన్మకొండ కల్చరల్: వరంగల్ పోతన విజ్ఞాన పీఠం 36వ వార్షికోత్సవం రెండో రోజు ఆదివారం ఘనంగా ముగిసింది. పోతన పీఠం కార్యదర్శి గందె శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ చెన్నమనేని హనుమంతరావు రచించిన 'మహా భారతం.. నిత్య జీవన సూత్రాలు' పుస్తకావిష్కరణ జరిగింది. ప్రముఖ సంస్కృత పండితులు సముద్రాల శఠగోపాచార్య పుస్తక పరిచయం చేశారు. అనంతరం డా.ఎన్వీ ఎన్ చారి రచించిన, పోతన విజ్ఞాన పీఠం ప్రచురించిన వేంకటేశ్వర-సామాజిక పద్యశతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్త గన్నమరాజు గిరిజామనోహర్‌బాబు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, డాక్టర్ వజ్జుల రంగాచార్య, వనం లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. ఈసందర్భంగా హైదరాబాద్‌కు చెందిన నటుడు, కవి, ప్రయోక్త తుమ్మూరి రామ్‌మోహన్‌రావుకు మహాకవి పోతన పురస్కార బిరుదు ప్రదానం చేశారు. విశాఖపట్టణానికి చెందిన నాటక రచయిత, నటులు డాక్టర్ మీగడ రామలింగస్వామి నవరాగావధానం అలరించింది. సంధానకర్తగా డాక్టర్ ఎన్వీఎన్ చారి వ్యవహరించారు. కార్యక్రమంలో పీఠం మేనేజర్ జెఎస్ శర్మ, సభ్యులు అడ్లూరి చంద్రశేఖర్, జూలూరి నాగరాజు, చెనమల్ల శ్రీధర్, మాడిశెట్టి రమేశ్, బొల్లం సంజీవ పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద భక్తుల సందడి



వనదేవతల దర్శనం అనంతరం తిరుగుపయనమైన భక్తులు



అమ్మవార్లకు మొక్కుతున్న భక్తురాలు



మేడారం జనారణ్యం

అమ్మవార్లకు పౌర్ణమి పూజలు

మేడారం జనారణ్యంగా మారింది. మినీ జాతర శనివారంతో ముగిసినప్పటికీ ఆదివారం మాఘ శుద్ధ పౌర్ణమి కావడంతో వివిధ ప్రాంతాల నుంచి 1.50 లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానికి గంటల తరబడి సమయం పట్టింది.

- ఎస్ఎస్ తాడ్వాయి

- వివరాలు 8లో

కాల్వ కబ్జా



భూమి కలిపేసుకుని.. ప్రవాహాన్ని అడ్డుకొని కబ్జా

- మడికొండ-సోమిడి కాల్వ వెంట రియల్టర్ల హవా
- పట్టించుకోని అధికారులు



సోమిడి చెరువు వైపు ఉన్న కాల్వ దుస్థితి, (ఇన్‌సెట్‌లో) ఆక్రమణలతో పిల్ల కాల్వగా మారిన పెండ్లి వాగు కాల్వ

కాజీపేట: రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారుల సమన్వయ లోపం, ఉదాసీనతతో కాల్వ భూములను కొందరు ఆక్రమిస్తున్నారు. సమీప ప్రైవేట్ పట్టా భూములున్న వ్యక్తులు కాల్వ పోరంబోకు భూమిని కబ్జా చేసి వాటిల్లో యథేచ్ఛగా శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు సైతం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో చెరువుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది.

ఇదీ పెండ్లి వాగు దుస్థితి..

కాజీపేట మండలం మడికొండ పెద్ద చెరువు, పరికి కుంట కింద ఉన్న పెండ్లి వాగుకు రెండు వైపులా.. పరికి కుంట, పెద్ద చెరువులున్నాయి. వర్షపు నీటితో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరంతా మత్తడి పడితే ఈవాగు నుంచి సోమిడి చెరువుకు కాల్వ ద్వారా వరద చేరుతుంది. ప్రకృతి సిద్ధంగా గొలుసు కట్టు చెరువులను కలుపుతూ ఏర్పడిన కాల్వ అతి కొద్ది రోజుల్లోనే అధికారుల వైఖరి కారణంగా కనుమరుగవనుంది. 3 కిలోమీటర్ల పొడవు కలిగిన కాల్వకు రెండు వైపులా ఆక్రమణలున్నాయి. లేఔట్లు, ప్రైవేట్ భూముల యజమానులు కాల్వ పోరంబోకు భూమిని ఇష్టానుసారంగా కలిపేసుకుని కంచెలు, ప్రహరీలు నిర్మిస్తున్నారు. తమ భూమితో పాటు ప్రభుత్వ భూమి తమకే చెందుతుందని వాదిస్తున్నారు. కొన్నేళ్లుగా.. తమ అనుభవంలోని భూమిపై హక్కులు తమకే ఉన్నాయంటున్నారు. మడికొండ పెండ్లి వాగు నుంచి సోమిడి ఊర చెరువు వరకు కాల్వ పొడుగునా కబ్జాలు కొనసాగుతున్నాయి. మడికొండ నుంచి సోమిడి వరకు ఉన్న కాల్వ భూమి అక్రమార్కుల పరమవుతుంది. రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు పర్యవేక్షించాల్సి ఉన్నా.. ప్రైవేట్ భూ యజమానుల ఒత్తిడి కారణంగా వారు కూడా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈమూడు కిలో మీటర్ల పొడవునా జరిగిన అక్రమణల విలువ రూ. యాభై కోట్లకు పైగా ఉంటుందని భావిస్తున్నారు.

కాల్వ శుభ్రం చేయడానికి వీలు కావట్లే..

కాల్వను ఏటా నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో శుభ్రం చేస్తారు. వర్షాకాలానికి ముందు వ్యర్థాలు తొలగించడం పరిపాటి.

అయితే ఆక్రమణల కారణంగా కొంత కాలంగా శుభ్రపర్చడానికి వీలుకావట్లేదు. ఇది ఇలాగే కొనసాగితే పోరంబోకు కాల్వలు పూర్తిగా కనుమరుగుకావడం ఖాయమంటున్నారు. వర్షాకాలంలో వరదనీరు జనావాసాలను ముంచెత్తే అవకాశం ఉంది. భవిష్యత్‌లో సోమిడి చెరువుకు నీరు చేరక ఆయకట్టు బీడుగా మారే ప్రమాదం ఉంది. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటిస్తే వాస్తవ పరిస్థితి ఏమిటో అవగతమవుతుంది. ఈవిషయమై రెవెన్యూ అధికారులను 'సాక్షి' వివరణ కోరగా.. క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆక్రమణలను తొలగిస్తామన్నారు.

ఓరుగల్లుపై కాంగ్రెస్ గురి!

క్యాడర్‌లో ఉత్తేజం నింపే ప్రయత్నం..

- ఉమ్మడి వరంగల్‌లో కార్యక్రమాలపై దృష్టి
- నిన్న రాహుల్‌గాంధీ రైతు సంఘర్షణ సభ.. నేడు హాథ్ సే హాథ్ జోడో యాత్ర
- ఆదివారం నుంచే ములుగులో ఏఐసీసీ, టీపీసీసీ నేతల మకాం..
- మేడారం నుంచి నేడు రేవంత్‌రెడ్డి పాదయాత్ర మరూ..

సాక్షిప్రతినిధి, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీ కార్యకలాపాలపై కాంగ్రెస్ అధిష్టానం దృష్టి సారించింది. వచ్చే ఎన్నికల నాటికి క్యాడర్‌లో ఉత్తేజం నింపేందుకు ప్రయత్నం చేస్తున్నది. ఏడాదిగా ఉమ్మడి వరంగల్‌పైన దృష్టి సారించిన కాంగ్రెస్ అధిష్టానం వరుస భారీ సభలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. మే 6 హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన రైతు సంఘర్షణ సభకు ఏఐసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరు కాగా, దేశవ్యాప్తంగా రైతు డిక్లరేషన్ ప్రకటించారు. ఈనెల 6(నేటి నుంచి) నుంచి టీపీసీసీ చీఫ్ ఎ.రేవంత్‌రెడ్డి మేడారం సమక్క-సారలమ్మ సన్నిధి నుంచి హాథ్ సే హాథ్ జోడో యాత్రకు శ్రీకారం చుడుతున్నారు. ఉద్యమాల ఖిల్లాగా పేరున్న వరంగల్‌ను అన్ని పార్టీలు కేంద్రంగా చేసుకుంటున్నాయి. ఇదే క్రమంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సైతం ఓరుగల్లుపై దృష్టి సారించింది.

'ఐ'కృత కోసం నేతలతో భేటీ..

ఉమ్మడి వరంగల్‌లోని పలు నియోజకవర్గాల్లో సీనియర్ నాయకులకు పొసగడం లేదు. సభలు, సమావేశాలు జరుగుతున్న క్రమంలో విభేదాలు బయట పడినా.. ఇంతకాలం నెట్టుకొచ్చారు. మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క, గండ్ర సత్యనారాయణ, వేం నరేందర్‌రెడ్డి, మాజీ కేంద్రమంత్రి పోరిక బలరాంనాయక్, దొంతి మాధవరెడ్డి, కొండా సురేఖ, కొండా మురళీధర్‌రావు, నాయిని రాజేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, రాజేశ్వర్‌రావు, జంగా రాఘవరెడ్డి, కొమ్మూరి ప్రతాపరెడ్డి, ఇనుగాల వెంకట్రాంరెడ్డి, నమిండ్ల శ్రీనివాస్‌లతో పాటు పలువురి పేర్లు వచ్చే ఎన్నికల రేసులో ఉన్నట్లు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నలుగురైదుగురికి పైగా పోటీపడుతున్నారు. కొందరు నాయకులు రెండు, మూడేసి నియోజకవర్గాల్లో టికెట్ కోసం ఖర్చీఫ్ వేసుకునే పనిలో తిరుగుతుండటంతో విభేదాలు తారాస్థాయికి చేరుతున్నాయి. దీంతో నాయకుల మధ్య సమన్వయం కుదరక ఇష్టారాజ్యంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం అధిష్టానానికి తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పాదయాత్రను విజయవంతం చేయాలని హైకమాండ్ నుంచి ఉన్న ఆదేశాలమేరకు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రెండు రోజుల క్రితం సీనియర్ నాయకులతో మాట్లాడినట్లు తెలిసింది. అందరూ కలిసి ఐక్యంగా పని చేయాలని, సమన్వయం చేసిన తర్వాతే మేడారం నుంచి రేవంత్ పాదయాత్రను ప్రారంభిస్తున్నట్లు చెబుతున్నారు.

పోరుగడ్డ నుంచే పాదయాత్ర..

హాథ్ సే హాథ్ జోడో యాత్రకు ఉద్యమాల ఖిల్లా, పోరుగడ్డ వరంగల్‌ను రేవంత్‌రెడ్డి ఎంచుకున్నారు. ఈ మేరకు సోమవారం నుంచి ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం నుంచి పాదయాత్రకు శ్రీకారం చుట్టనుండగా.. మాజీ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే డాక్టర్ ధనసరి సీతక్క, టీపీసీసీ నేతలు మల్లు రవి, కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్, మాజీ ఎంపీ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, గండ్ర సత్యనారాయణరావు, ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వేం నరేందర్‌రెడ్డి తదితరులు ఆదివారమే చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రను మన ఇంటి కార్యక్రమంగా భావించి అన్ని వర్గాల వారు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కార్యకర్తలు, ప్రజలకు పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డి పాదయాత్ర షెడ్యూల్‌ను పార్టీ నాయకులు విడుదల చేశారు. పాదయాత్ర 6వ తేదీ ఉదయం 11 గంటలకు మేడారం నుంచి ప్రారంభం కానుంది.

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనం పెంపు

- రూ.వెయ్యి నుంచిరూ.3 వేలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం
- నేటి నుంచి విజయోత్సవ సభలు



మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు బొట్ల చక్రపాణి

విద్యారణ్యపురి: మధ్యాహ్న భోజన కార్మికులకు నెలవారీ గౌరవ వేతనాన్ని రూ.వెయ్యి నుంచి రూ.3 వేలకు పెంచుతూ విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఈనెల 4న ఉత్తర్వులు జారీ చేశారు. కొన్నేళ్లుగా వేతనం పెంచాలనే డిమాండ్‌తో కార్మికులు ఆందోళనలు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో వేతనం పెరగడంపై కార్మికుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. హనుమకొండ జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, జిల్లా పరిషత్ యాజమాన్యాల 485 పాఠశాలల్లో 37,956 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. ఆయా పాఠశాల్లోని 932 మంది మధ్యాహ్న భోజన కార్మికులు ఇక నుంచి నెలకు రూ 3.వేలు గౌరవ వేతనం పొందనున్నారు.

పోరాటాల ఫలితంగానే..

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో చేసిన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం వేతనాలు పెంచిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బొట్ల చక్రపాణి తెలిపారు. ఆదివారం హనుమకొండలోని సీఐటీయూ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికుల విజయోత్సవ సభను కార్మికురాలు శాంత అధ్యక్షతన నిర్వహించారు. ఈనెల 6, 7, 8 తేదీల్లో మండల కేంద్రాల్లో విజయోత్సవ సభలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాలు సుజాత, బాధ్యులు కవిత, సీత, లక్ష్మి సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రేటర్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్(జీడబ్ల్యూఎంసీ) గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ అనిస్ ఉర్ రషీద్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజలు తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో అందజేస్తే స్వీకరిస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ సెల్ వేదిక అని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బంగారు తెలంగాణ ఇదేనా..?

హనుమకొండ

- ప్రజా ప్రస్థానం పాదయాత్రలో వైఎస్ షర్మిల

పబ్లిక్‌గార్డెన్ వద్ద మాట్లాడుతున్న షర్మిల




రాష్ట్రం, ప్రజలు అప్పులపాలు కావాలి.. ఆత్మహత్య చేసుకోవాలి.. మీరు మాత్రం కమీషన్లు తీసుకోవాలి.. బంగారు తెలంగాణ అంటే ఇదేనా? అని వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. ఆమె చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్ర ఆదివారం వరంగల్, హనుమకొండలో సాగింది.

- ఖిలా వరంగల్/హన్మకొండ చౌరస్తా

- 10లో

నేటి నుంచి తాగునీటి సరఫరా బంద్

- మూడ్రోజులు నగరవాసులకు ఇబ్బందులు



కాకతీయ కెనాల్‌లో పారుతున్న నీరు

వరంగల్ అర్బన్: ధర్మసాగర్ చెరువు నుంచి నగరానికి వచ్చే 2,100 ఎంఎం డయా ప్రధాన పైపులైన్‌పై మూడు బట్టర్ ఫ్లై వాటర్ వాల్వ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో (నేటి నుంచి) సోమ, మంగళ, బుధ మూడ్రోజులు వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిచిపోనుంది. మూడ్రోజుల్లో ఏర్పాట్లు పూర్తవకపోతే మరో రెండు రోజులు నగరవాసులకు తాగునీటికి ఇబ్బందులు తప్పేలా లేవు.

ముందు చూపేది ?

ధర్మసాగర్ నుంచి వచ్చే పైపులైన్లకు మరమ్మతులుంటే కాకతీయ కెనాల్ నీటిని వాడుకోవచ్చు. అందుకు కావాల్సిన మార్గం సిద్ధంగా ఉంది. కానీ గ్రేటర్ వరంగల్ ఇంజినీర్ల పట్టింపు, ముందు చూపు లేని కారణంగా నగరంలోని పలు జోన్లలో తరుచూ తాగునీటి ఇబ్బందులు ప్రజలకు తప్పడం లేదు. నగర ప్రజల అవసరాలకు పదేళ్లకు ముందు భద్రకాళి, వడ్డేపల్లి చెరువులు సమ్మర్ స్టోరేజీలుగా ఉపయోగంలో ఉండేవి. ఈ జలాశయాల్లో నీళ్లు దగ్గర పడితే కరీంనగర్ ఎల్ఎండీ నుంచి కెనాల్ ద్వారా నగరానికి జలాలు చేరుతుండేవి. కేయూసీ మీదుగా వడ్డేపల్లి, దేశాయిపేట రా వాటర్ నుంచి భద్రకాళి చెరువులను నింపడంతోపాటు నీటి శుద్ధి జరిగేది. దీంతో నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందుల నుంచి పరిష్కారం లభించేది. దశాబ్దకాలంగా నగరంలోని భద్రకాళి, వడ్డేపల్లి చెరువులను విస్మరిస్తున్నారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా ధర్మసాగర్ చెరువులోకి జలాలను పంపింగ్ చేస్తున్నారు. అక్కడి నుంచి నేరుగా వడ్డేపల్లి, కేయూసీ, దేశాయిపేట ఫిల్టర్‌బెడ్ ద్వారా రా వాటర్‌ను శుద్ధి చేసి పంపింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇక అండర్ రైల్వే గేట్‌ను గత రెండేళ్ల కిందట ప్రత్యేక జోన్‌గా ప్రకటించి ధర్మసాగర్ వద్ద ఫిల్టర్ నుంచి నేరుగా నీటి సరఫరా జరుగుతోంది. ప్రస్తుతం అండర్ రైల్వే గేట్ జోన్‌లో ఎలాంటి తాగునీటి ఇబ్బందులు లేవు.

అవకాశాలున్నా.. వినియోగం సున్నా..

ధర్మసాగర్ చెరువు వద్ద బటర్ ఫ్లై వాల్వ్‌ల ఏర్పాటుతో రా వాటర్ నిలిచింది. నగరం నుంచి కాకతీయ కెనాల్ జలకళతో ఉవ్వెత్తున పారుతోంది. కెనాల్ నుంచి కేయూసీ ఫిల్టర్‌బెడ్ మీదుగా వడ్డేపల్లి, దేశాయిపేట ఫిల్టర్లకు రావాటర్ తీసుకునే అవకాశం ఉంది. ఆ నీటిని శుద్ధి చేసి మహా నగర ప్రజలకు అందించడంలో బల్దియా యంత్రాంగం విఫలమవుతోంది. బల్దియా ఇంజినీర్లు ఆదిశగా ఆలోచించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో దేశాయిపేట ఫిల్టర్ బెడ్ నుంచి అండర్ రైల్వే గ్రేట్ ప్రాంతానికి నీటి సరఫరా జరుగుతుండేది. ప్రస్తుతం ధర్మసాగర్ నుంచి జరుగుతోంది. అక్కడ ఏమైనా ఇబ్బందులు తలెత్తితే దేశాయిపేట నుంచి పంపింగ్ చేసే వీలుంది.

కానీ.. ఇంజినీర్లు చొరవ తీసుకోవడం లేదు. నగర ప్రజలకు ఏమాత్రం నీటి ఇబ్బందులు తలెత్తకుండా దేవాదుల, ఎల్ఎండీల రెండు మార్గాల ద్వారా నీటి వాడుకునేందుకు అవకాశాలున్నా.. బల్దియా ఇంజినీర్ల మధ్య సమన్వయ లోపం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్ల నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

 - 10లో

క్లుప్తంగా

నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై కేసు నమోదు

కాజీపేట రూరల్: పోలీసులపై దురుసుగా ప్రవర్తించి వారి విధులను అటంకపరచిన నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై ఆదివారం కాజీపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. కాజీపేట ప్రశాంత్‌నగర్‌కు చెందిన బి.నాగు ఈ నెల 4న రాత్రి వడ్డెపల్లి వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద హుండాయి కార్ నంబర్ ఏపీ 36 ఏఎల్ 7806 ఆపకుండా వెళ్లగా అతనిని వెంబడించి పట్టుకొని వాహనం డాక్యుమెంట్స్ అడుగగా ఇవ్వను అని పోలీసులతో తాగిన మైకంలో వాగ్వాదం చేసి విధులకు అటంకపరిచినట్లు తెలిపారు. ఇతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్రెడిట్‌కార్డు పేరుతో మోసం

కాజీపేట దర్గా అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఒక వ్యక్తికి ఒక అతను ఫోన్ చేసి నేను కొటక్ మహేంద్ర క్రెడిట్ కార్డు ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నానని చెప్పాడు. మీ క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుకోవాలంటే నేను ఒక లింక్ పంపిస్తున్నాను. ఆ లింక్‌ను ఓపెన్ చేసి మీ క్రెడిట్ కార్డు వివరాలు ఎంటర్ చేయమని చెప్పగా ఆ వ్యక్తి లింక్ ఓపెన్ చేసి క్రెడిట్ కార్డు వివరాలు పంపించగా ఓటీపీలు ఓపెన్‌చేయగా అతని క్రెడిట్ కార్డు నుంచి రూ.1,11,395లు డెబిట్ అయిపోయినట్లు మెస్సేజ్ వచ్చింది. వెంటనే సదరు వ్యక్తి మోసపోయానని గ్రహించి వెంటనే సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ మహేందర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

కేవైసీ వివరాలు అప్‌డేట్ చేస్తానని మోసం

కాజీపేట వెంకటాద్రినగర్‌కు చెందిన ఒకతనికి జనవరి 23న మీ ఎస్‌బీఐ అకౌంట్ నంబర్ బ్లాక్ అయింది. అప్‌డేట్ చేసుకోవాలని ఒక మెసేజ్ రాగా వెంటనే ఆ వ్యక్తి ఆ లింక్‌ను ఓపెన్ చేసి అతని కేవైసీ వివరాలు అందులో ఎంటర్ చేశాడు. ఓటీపీలు కూడా ఎంటర్ చేయగా అతని ఎస్‌బీఐ అకౌంట్ నుంచి రూ.25 వేలు డెబిట్ అయ్యాయి. అతను వెంటనే గ్రహించి సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ మహేందర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చాలా సంతోషంగా ఉంది



అమ్మవార్లను దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉంది. పౌర్ణమి రోజు కావడంతో అమ్మవార్లకు మొక్కులు చెల్లిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని విశ్వాసం ఉంది. గద్దెల పైకి అధికారులు అనుమతించడంతో ఆనందంగా ఉంది.

- సంధ్య, భక్తురాలు, హైదరాబాద్

వనదేవతలపై విశ్వాసం



వనదేవతల దర్శించుకుంటే సకల సౌభాగ్యాలు కలుగుతాయని నమ్మకం ఉంది. పెళ్లి అయ్యి ఇద్దరు పిల్లలు పుట్టినప్పటి నుంచి అమ్మవార్లను దర్శించుకునేందుకు ప్రతి యేటా కుటుంబంతో వస్తున్నాం. పౌర్ణమి రోజు మొక్కులు చెల్లించుకోవడం అదృష్టంగా భావిస్తున్నాం.

- దివ్య, భక్తురాలు, వరంగల్

అందరి సహకారంతో విజయవంతం..



జిల్లా అధికార యంత్రాంగం సహకారంతో నాలుగు రోజుల పాటు జరిగిన మినీజాతర విజయవంతమైంది. మండమెలిగె పండుగ సందర్భంగా పూజారులు పూజలకు ఎలాంటి అంతరాయం కలుగకుండా సహకరించారు. జాతర విజయవంతానికి కృషి చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు.

- రాజేంద్రం, ఈఓ

జాతరలో పకడ్బందీగా చర్యలు



సమ్మక్క, సారలమ్మ మినీ జాతరలో పోలీసుశాఖ తరఫున జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రణాళిక బద్ధంగా అన్ని చర్యలు చేపట్టాం. ఉన్నతాధికారుల పర్యవేక్షణ, సూచనల మేరకు అధికారులు. సిబ్బంది సమష్టిగా పని చేసి జాతరను సక్సెస్ చేశాం. ట్రాఫిక్‌జామ్ కాకుండా అమ్మవార్ల గద్దెల ప్రాంగణం దగ్గర పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశాం.

- శంకర్, సీఐ పస్రా

ప్రణాళికబద్ధంగా వ్యవహరించాం..



భక్తులకు ఎలాంటి అటంకాలు కలుగకుండా పోలీస్ శాఖ తరఫున చర్యలు తీసుకున్నాం. ఎస్పీ గౌస్ ఆలం సూచనల మేరకు ప్రణాళికబద్ధంగా వ్యవహరించి భక్తులకు అటంకం కలుగకుండా ట్రాఫిక్ నియంత్రణ, దర్శనాలు జరిగేలా చర్యలు తీసుకున్నాం.

- ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్సై, తాడ్వాయి

మేడారం జనారణ్యం

1.50 లక్షల మందికిపైగా తరలివచ్చిన భక్తులు

- అమ్మవార్లకు పౌర్ణమి పూజలు
- భక్తులతో కిక్కిరిసిన గద్దెల ప్రాంగణాలు



ఎదురుకోడి మొక్కు..



సారలమ్మ గద్దె వద్ద భక్తుల కోలాహలం

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం జాతరకు ఆదివారం 1.50 లక్షల మందికి పైగా భక్తులు తరలిరావడంతో సందడి నెలకొంది. శనివారంతో మినీజాతర ముగిసినప్పటికీ ఆదివారం మాఘశుద్ధ పౌర్ణమి కావడంతో అమ్మవార్లను దర్శించుకునేందుకు రాష్ట్రంలోని వివిధ సుదూర ప్రాంతాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవార్ల దర్శించుకునేందుకు భక్తులకు గంటల తరబడి సమయం పట్టింది. భక్తుల సందడితో గద్దెల ప్రాంగణాలు కిటకిటలాడాయి. ఈఓ రాజేంద్రం భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఎప్పుటికప్పుడు పర్యవేక్షించి వారికి ఏర్పాట్లను చేశారు.

శనివారం రాత్రి నుంచే రద్దీ..

శనివారం రాత్రి నుంచే భక్తుల రద్దీ పెరిగింది. వేలాదిగా వాహనాలు మేడారంలో బారులు తీరాయి. పస్రా నుంచి వాహనాల రాకతో నార్లాపూర్‌లో కొద్దిసేపు ట్రాఫిక్ జామ్‌తో అంతరాయం ఏర్పడింది. వెంటనే అక్కడి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



సమ్మక్క గద్దె వద్ద భక్తుల కోలాహలం

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు..

ఆదివారం లక్షలాదిగా భక్తులు తరలివస్తారని అంచనాతో పోలీసు ఉన్నతాధికారులు మేడారంలో ఉన్న అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎస్పీ గౌస్ ఆలం మేడారంను సందర్శించి భక్తుల రద్దీని పర్యవేక్షించారు. భక్తుల వాహనాలను పోలీసులు పార్కింగ్ ప్రదేశాలకు మళ్లింపు చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీ పెరగడంతో ఆర్టీసీ బస్సుల సంఖ్యను కూడా అధికారులు పెంచారు.





క్యూలో భక్తుల రద్దీ



తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు



షవర్ల కింద స్నానాలు చేస్తున్న భక్తులు



జంపన్నవాగులో శివసత్తుల పూనకాలు



మేడారం సమీపంలో వంటలు, భోజనాలు



వాహనాల్లో మేడారం చేరుకుంటున్న భక్తులు

వేర్వేరు కారణాలతో పలువురి మృతి



శాయంపేట : మండలంలోని సూరంపేటలో ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి రైతు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై వీరభద్రరావు కథనం ప్రకారం.. సూరంపేటకు చెందిన రైతు కొప్పుల రాజయ్య(56) తన భార్య స్వరూపతో శనివారం ఉదయం వ్యవసాయ బావివద్దకు వెళ్లాడు. వ్యవసాయ బావి వద్దకు వెళ్లి మొక్కజొన్న పంటకు నీరు పారిస్తుండగా మధ్యాహ్నం బావిలో నీరు అయిపోయిందని బావి వద్దకు వెళ్లి నీటిపైపును సరిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు రాజయ్య బావిలో పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆదివారం మృతుడి కుమారుడు దేవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధురాలు..

- రేపు కేఎంసీకి నేత్రాలు, మృతదేహం అప్పగింత



రాజమ్మ(ఫైల్)

భీమదేవరపల్లి: ఇక ఆమె సజీవంగా ఉండనుంది. ఆమె నేత్రాలు ఇతరులకు చూపును అందించనున్నవి. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఆకునూర్‌కు చెందిన వంగ రాజమ్మ ఉరఫ్ అమృతమ్మ(85) ఆదివారం హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి కొత్తపల్లిలో మృతి చెందింది. అయితే ఆమె నేత్రాలు, అవయవదానం చేస్తున్నట్లు గతంలోనే ఆమె చేసుకున్న ఒప్పందం మేరకు మృతదేహాన్ని సోమవారం కేఎంసీ వైద్యులు తీసుకెళ్లనున్నారు. రాజమ్మ అనేక ఏళ్లుగా ఆమె అల్లుడైన కొత్తపల్లికి చెందిన కొంగల రాంచంద్రారెడ్డి ఇంట్లోనే ఉంటూ జీవనం సాగిస్తుంది. ఆరేళ్ల క్రితం తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యుడైన కొంగల రాంచంద్రారెడ్డి, అతని భార్య లక్ష్మి మరణానంతరం నేత్ర, అవయవదానానికి ముందుకొచ్చారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొన్న రాజమ్మ సైతం నేత్ర, అవయవ దానానికి ఒప్పుకుంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాజమ్మ మృతి చెందడంతో కేఎంసీకి సమాచారం అందించారు. రాజమ్మ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, నాయకులు కామెర వెంకటరమణ, మార్పు కృష్ణారెడ్డి, రావుల తిరుపతి, ఆదరి రమేష్ మృతదేహం వద్ద ఆదివారం రాత్రి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో..



వీరమ్మ (ఫైల్)

గూడూరు : మండలంలోని బొద్దుగొండ బస్టాండ్ సమీపంలోని జాతీయ రహదారి దాటుతున్న ఓ వృద్ధురాలిని గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వీరమ్మ (60) అనే యాచకురాలు బొద్దుగొండ బస్టాండ్ వద్ద ఉంటుంది. రాత్రి రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొని వెళ్లిపోయింది. వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించగా వాహనం వచ్చేలోపు ఆ వృద్ధురాలు మృతి చెందినట్లు అంబులెన్స్ సిబ్బంది గుర్తించారు.

రైలు ఢీకొని వ్యక్తి..



మాన్య (ఫైల్)

నెక్కొండ: గుర్తుతెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నెక్కొండలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వరంగల్ జీఆర్‌పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... నర్సంపేట మండలంలోని ముగ్దుంపురం గ్రామానికి చెందిన చండవత్ మాన్య (71) తన కూతురు జ్యోతి వద్దకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఎలుగూరు–నెక్కొండ రైల్వే స్టేషన్ల మధ్య అప్‌లైన్‌లో రైలు పట్టాలు దాటుతున్న క్రమంలో గుర్తుతెలియని రైలు ఢీకొంది. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు శవపంచనామా నిర్వహించి, బంధువులకు మృతదేహాన్ని అప్పగించామని సీఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య భద్రమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ట్రాక్టర్-బైక్ ఢీ..ముగ్గురికి తీవ్రగాయాలు

గార్ల: మండల కేంద్రం సమీపంలోని శ్మశాన వాటిక మూలమలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న ట్రాక్టర్-బైక్ ఢీకొనడంతో ముగ్గురు బైకిస్టులకు తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలావున్నాయి. పాకాల ఏటి మూలమలుపు వద్ద రాంపురం నుంచి మట్టిలోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌ను గండితండాకు చెందిన బానోత్ లాలూప్రసాద్, బానోత్ లక్ష్మణ్‌నాయక్, గూగులోత్ పృథ్వీనాయక్ ట్రిపుల్ రైడ్‌తో బైక్‌పై వెళ్తూ ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో లాలూప్రసాద్‌కు కాలు విరగడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లగా, లక్ష్మణ్‌నాయక్ తలకు తీవ్రగాయాలు, పృథ్వీకి స్వల్పగాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రులను గార్ల సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యురాలు చైతన్య తెలిపారు.

మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్

- వాట్సాప్ స్టేటస్‌తో రూ.50వేల సేకరణ
- అభినందించిన కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు

దీన గాథ

చిట్యాల : లా అండ్ ఆర్డర్‌ను కాపాడడమే కాదు ఆపదలో ఉన్న వారిని తన వంతు సాయం చేసి కాపాడుదామనే సంకల్పం అతనిది. నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తికి ప్రమాదవశాత్తు గొంతు, పక్కటెముకలు విరిగి మంచానికే పరిమితమైన అతని దీనగాధను చూసి చలించిపోయాడు. శాయంపేట మండలం వసంతాపూర్‌కు చెందిన మంద రాములు వారం క్రితం ప్రమాదానికి గురికావడంతో గొంతుకు 24 కుట్లు, పక్క బొక్కలు విరిగి మంచానికే పరిమితమయ్యాడు. బాధితుడికి భార్య, ఒక కూతురు ఉంది. ప్రస్తుతం ఆమె గర్భిణీ. మరో వారం రోజుల్లో డెలివరీకి రావాలని డాక్టర్ చెప్పాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న అతన్ని ఆదుకోవాలని నిర్ణయించుకొని మిత్రునికి సాయం చేయాలంటూ పదోతరగతి బ్యాచ్‌కు చెందిన చిట్యాలలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న లాల్ సింగ్ వాట్సాప్ స్టేటస్ ద్వారా రూ.50 వేలు సేకరించి బాధితుడికి అందించాడు. ఆ డబ్బులు రాముకు ఇచ్చి ధైర్యం చెప్పాడు. తను పెట్టిన స్టేటస్‌కి స్పందించి సాయం అందించిన చిట్యాల గ్రామ ప్రజలకు, తన తోటి సిబ్బందికి లాల్‌సింగ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకోవాలని కోరాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కానిస్టేబుల్‌ను అభినందించారు.



ఆర్థికసాయం అందజేస్తున్న కానిస్టేబుల్ లాల్‌సింగ్

15 క్వింటాళ్ల బెల్లం పట్టివేత

- వాహనం సీజ్ చేసిన ఎక్సైజ్ సీఐ

దంతాలపల్లి: 15 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టుకొని బొలెరో వాహనాన్ని సీజ్ చేసినట్లు తొర్రూరు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లం వస్తుందన్న పక్కా సమాచారంతో ఆదివారం తెల్లవారుజామున, తొర్రూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని దంతాలపల్లి, బొడ్లాడ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అటుగా వచ్చిన ఏపీ03 టీఏ 0096 నంబర్ గల బొలెరో వాహనం ఆపడంతో వాహనంపై అనుమానం వచ్చి దాడి జరిపారు. వాహనంలో (50 కిలోల బస్తాలు 30) 15 క్వింటాళ్ల నల్లబెల్లం, 5 కిలోల పటిక, 20 లీటర్ల నాటుసారా పట్టుబడిందన్నారు. వాహనంలోని వ్యక్తులను విచారించగా సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం దేవునిగుట్ట తండాకు చెందిన ఇస్లావత్ విజయ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన ఎం.జానకిరామ్‌గా గుర్తించారు. వీరంతా కలిసి తొర్రూరు, నర్సింహులపేట మండలాల్లోని వివిధ గ్రామాల్లో అక్రమంగా నల్లబెల్లం, పటిక రవాణా చేసేందుకు తీసుకొచ్చినట్లు తెలిపారన్నారు. ఇస్లావత్ విజయ్, జానకిరామ్‌పై కేసు నమోదు చేసి నాటుసారా, పటిక, బెల్లం వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై మధు, హెడ్ కానిస్టేబుల్ మధు, కానిస్టేబుళ్లు కుమార్, శ్రీనివాస్, గౌస్, శ్రావణ్ పాల్గొన్నారు.



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

- మామునూర్‌లో అభివృద్ధి చేసిన కుడా లే అవుట్ 263, 228, 200 గజాలు ప్లాట్లకై. సెల్: 9032111600. [W-775780]

బిల్డింగ్ అమ్మబడును

- వరంగల్, కరీమాబాద్, ఉర్సు దగ్గరలో మేయిన్‌రోడ్‌కు తూర్పు ఫేస్ గల 200 గజాల బిల్డింగ్ అమ్మబడును. సంప్ర: 9347219693, 9849459661 [W-775814]

SERVICES

- బాలాజీ గోల్డ్ : మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును (స్పాట్ క్యాష్), తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 90320 40019. [T-1746]

LOANS

- హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ వారికి ఆర్థిక సహాయం చేయబడును సెల్: 7569519258 హన్మకొండ. [WA-6471]

WANTED

- Ice Cream, Milk Shakes, Snacks, Tea Masters కావలెను / మంచి కండీషన్లో ఉన్న వస్తువులు కావలెను. సంప్ర॥ 9866072260. [WA-6474]
- ప్రముఖ కార్పొరేట్ finance సంస్థలో పనిచేయడానికి అనుభవం కలిగిన టీం లీడర్స్ & కలెక్షన్ బాయ్స్ కావలెను. జీతం: 15000 to 20000/- వేల వరకు ఇంటర్వ్యూ 6th Febన జరుగును. సంప్ర॥ 8897653065. [WA-2927]
- కాంట్రాక్టర్ వద్ద పెట్రోల్ పంప్ కన్‌స్ట్రక్షన్‌లో పనిచేయుటకు అనుభవం కలిగిన అకౌంటెంట్, సూపర్‌వైజర్స్ & సివిల్ ఇంజనీర్లు కావలెను. సంప్ర॥ సెల్: 9989606333, 9000243232. [W-775813]
- Wine Shop లో పనిచేయుటకు వర్కర్స్ కావలెను. హసన్‌పర్తి మరియు కమలాపూర్. సంప్రదించండి. సెల్: 9182922080. [WA-12458]
- ప్రముఖ కుబోట ట్రాక్టర్ డీలర్‌షిప్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేయుటకు ట్రాక్టర్ ఫీల్డ్‌లో కనీస అనుభవం కలిగిన వారు కావలెను. ఆకర్షణీయమైన జీతం+ఇన్సెంటివ్స్. సెల్: 9398680229 [WA-12461]

- ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779876]
- స్టార్ హోంకేర్ Hyd. లో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీకేర్, ఇంటి/వంటపనికి స్త్రీ/పు, టెలీ కాలర్స్ కావలెను. జీతం: 16,000/- to 25,000/-. రూం + భో. ఫ్రీ. ఫోన్: 8639132775, 8639828228 [V-775099]
- వివిధ విమానాశ్రయాలలో ఉద్యోగాలుకలవు. 10th /ఇంటర్ ఆపై చదివిన వారికి 6నెలలు ట్రైనింగ్ సర్టిఫికెట్ మరియు ఉద్యోగం ఇవ్వబడును. జీతం: 12,000/- నుంచి 15,000/- వయసు 18-26 సం॥ వరకు మాత్రమే సంప్ర॥ ✆ 93478 58540. [O-786968]
- త్రివేణి హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోడానికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి+భోజనం. జీ: 18K. ఏజెంట్స్ కమీషన్. 3K Ph: 7569955551, 9848571888 [H-786830]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/-రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ 9505507558, 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9505507558
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

www.sakshi.com

వ్యక్తి ఆత్మహత్య



కుమారస్వామి (ఫైల్)

వరంగల్ రూరల్ : ఎనుమాముల శివారు బాలాజీనగర్‌కు చెందిన గంధం కుమారస్వామి ఆదివారం ఉదయం తన నివాసంలో అప్పు ఇచ్చిన వారి వేధింపులు భరించలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య గంధం లక్ష్మి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ చేరాలు తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. కుమారస్వామి వ్యాపార నిమిత్తం అడిగొప్పుల సాంబేశ్వర్ (బాబురావు), అతని భార్య ప్రమీల, కోట విజయ్‌కుమార్‌ల వద్ద అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించాలంటూ వారి వేధింపులను భరించలేక ఉరేసుకుని ఆత్మహత్మకు పాల్పడినట్లు తెలిపింది. కేసు పూర్వపరాలను పరిశీలించి విచారించనున్నట్లు పోలీసులు తెలిపారు.

రామప్పలో భక్తుల సందడి

వెంకటాపురం(ఎం): మండలంలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రామప్ప దేవాలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం విద్యార్థులు, భక్తులు, పర్యాటకులతో కిక్కిరిసిపోయింది. సుమారుగా పదివేల మంది పర్యాటకులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజరులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్‌లు భక్తులకు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించారు. ఆలయంలో ఉత్సాహంగా కుటుంబ సభ్యులతో, స్నేహితులతో కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం రామప్ప సరస్సుకు చేరుకొని బోటింగ్ చేసి ఆహ్లాదంగా గడిపారు.

రామప్పను సందర్శించిన ఎమ్మెల్సీ, మాజీ మంత్రి సారయ్య

రామప్ప దేవాలయాన్ని ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బస్వరాజు సారయ్య దంపతులు, జిల్లా పరిషత్ కౌన్సిల్ చంద్రశేఖర్ రెడ్డి దంపతులు వేర్వేరుగా సందర్శించారు.ఆలయ అర్చకులు వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామి వారి శేషవస్త్రాలను బహూకరించారు. కాకతీయ రాజులు ముందుచూపుతో నిర్మించిన దేవాలయాలు, సరస్సులు నేటి ప్రజలకు ఉపయోగపడుతున్నాయని అన్నారు. అనంతరం రామప్ప సరస్సును సందర్శించారు. వారి వెంట డీపీఓ వెంకయ్య, పాలంపేట సర్పంచ్ డోలి రజిత శ్రీనివాస్. ఎంపీవో తదితరులు ఉన్నారు.



రామప్ప శిల్పకళను పరిశీలిస్తున్న సందర్శకులు